అమరుల త్యాగాలు మరువలేనివి

నాగర్‌కర్నూల్: రాష్ట్ర సాధన కోసం అమరులైన వారిని స్మరించుకోవడం అదృష్టమని, వారి త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ నూతన ఇంటిగ్రేటెడ్ జిల్లా అధికారుల కాంప్లెక్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, అన్ని కార్యాలయాల అధికారులు తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

దశాబ్ది ఉత్సవాలపై మున్సిపల్ తీర్మానం

కల్వకుర్తి టౌన్: అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రమని, అలాంటి త్యాగధనులను స్మరించుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో అమరవీరులకు ఎమ్మెల్యేతో పాటుగా మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు, సిబ్బంది నివాళి అర్పించారు.

అమరుడికి నివాళి

కల్వకుర్తి: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుడు కృష్ణయ్యకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆత్మత్యాగాన్ని కొనియాడారు. సగర సంఘం నాయకులు నివాళి అర్పించారు. దుర్గయ్య సాగర్, దాసు, దుర్గయ్య, శ్యాం సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

- మలి దశ తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాలు వెలకట్టలేనివని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళి అర్పించారు.
- అమరవీరుల త్యాగఫలితమే రాష్ట్ర ఏర్పాటు అని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరులకు నివాళి అర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్



కల్వకుర్తిలో మౌనం పాటిస్తున్న ఎంపీపీ



వెల్దండ మండల పరిషత్ కార్యాలయంలో ..



అచ్చంపేటలో మౌనం పాటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చారకొండలో ఎంపీడీఓ కార్యాలయంలో..



ఊర్కొండలో అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



నాగర్‌కర్నూల్‌లో అమరులకు నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, సిబ్బంది

క్లుప్తంగా

ఐఐటీ ర్యాంకర్‌కు అభినందన

కల్వకుర్తి టౌన్: ఐఐటీ అడ్వాన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బ్రిలియంట్ పాఠశాల యాజమాన్యం గురువారం ప్రశంసించింది. పాఠశాలలో చదివిన విద్యార్థి గౌతమ్‌కు ఆలిండియా 437 ర్యాంకు సాధించాడు. భవిష్యత్‌లో తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని బ్రిలియంట్ పాఠశాలల చైర్మన్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి విద్యార్థిని అభినందించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి అధ్యక్షురాలు



కల్వకుర్తి రూరల్: భారత జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు పావని గురువారం హైదరాబాద్‌లో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో జాగృతి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉప్పునుంతల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్‌ను గురువారం పాఠశాలలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, బాలమణి, కట్టా గోపాల్‌రెడ్డి, తిర్పతయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుల చేయూత



లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లికి చెందిన కుమ్మరి వెంకటయ్య కొన్ని రోజుల కిందట మృతిచెందాడు. మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు ఆధ్వర్యంలో యువకులు జమ చేసిన రూ.18 వేలను గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. మహేష్, గోపాలకృష్ణ, యాదయ్య, పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో గురువారం ఏపీజీవీబీ నూతన భవనాన్ని ఆ బ్యాంకు శాఖ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ భీంనేష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. గతంలో ఖాతాదారులు బ్యాంకు చిన్నదిగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారని అన్నారు. ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా ఉండాలని విశాలమైన నూతన భవనం తీసుకున్నామన్నారు. రాంగోపాల్‌రెడ్డి, రాంగోపాల్ రెడ్డి, విజయరామారావు, బాలరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



అచ్చంపేట రూరల్: వట్టెం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో అచ్చంపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో అచ్చంపేటలోని జీఎన్‌ఆర్ ఆదిత్య స్కూల్ 8 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇక్షిత, సాయివిశాలాక్ష్మి, సహస్ర, హర్షిత్, సాయిచరణ్‌తేజ, రుద్రకేతన్, సహస్ర, దివ్యశ్రీలను గురువారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

విద్యార్థి ఎంపిక..



రోహన్

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కూన రోహన్ అనే విద్యార్థి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి వట్టెం నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో అర్హత సాధించాడు. దీంతో సర్పంచ్ భూపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు అభినందించారు.

కౌన్సిలర్లపై వివక్ష సరికాదు



నినాదాలు చేస్తున్న కౌన్సిలర్లు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో గురువారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని మాజీ మంత్రి జూపల్లి వర్గీయులైన కౌన్సిలర్లు బహిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, జూపల్లి వర్గానికి చెందిన కౌన్సిలర్లు హాజరయ్యారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఎజెండాను ప్రవేశపెట్టారు. తమ వార్డులకు అభివృద్ధి నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ జూపల్లి వర్గీయులు సమావేశాన్ని బహిష్కరించారు. కార్యాలయ గేటు ఎదుట చైర్‌పర్సన్, కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలర్లపై వివక్ష చూపడం సరికాదన్నారు. అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి నిధులు పంచాలని డిమాండ్ చేశారు. సమావేశాన్ని బహిష్కరించిన వారిలో కౌన్సిలర్లు రమ్యకుమారి, బాలస్వామి, పిన్నంశెట్టి జ్యోతి, శ్రీలక్ష్మి, శిరీష, నయూమ్ ఉన్నారు.

దీక్షను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో శుక్రవారం పిల్లల సంక్షేమం కోసం తలపెట్టనున్న హరిగోస దీక్షలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోళ్ల శివ గురువారం పిలుపునిచ్చారు. అనాథ పిల్లలకు 8 సంవత్సరాల కిందట కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించడంతో ఈ దీక్ష చేపడుతున్నామన్నారు.

ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు



ధర్నాలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

అచ్చంపేట: దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని, ఏం సాధించారని ఉత్సవాలు నిర్వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ ప్రశ్నించారు. 'దశాబ్ది ఉత్సవాలు దగా' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దిష్టిబొమ్మలను రావణాసురుడిలా పది తలలు తయారు చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రదర్శన అనంతరం దహనం చేశారు. ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలు కాకపోయినా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేస్తోందని, నిధుల దుర్వినియోగం తప్పా.. ఏమాత్రం ప్రజలకు ఉపయోగం లేదన్నారు. కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య ,ఫీజు రీయంబర్స్‌మెంటు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి అమలు చేశారా అని ప్రశ్నించారు. ఎ.గోపాల్‌రెడ్డి, గౌరిశంకర్, గంగాపురం రాజేందర్, ఎం.రామనాథం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

కొల్లాపూర్: దశాబ్ది దగా పేరుతో కాంగ్రెస్ నాయకులు గురువారం కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కేతూరి వెంకటేష్, కాటమోని తిరుపతమ్మ, కృష్ణయ్యగౌడ్, అశోక్‌గౌడ్, రంగినేని జగదీశ్వరుడు, కాంతారావు తదితరులున్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో సీఎం, ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కల్వకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎంతో ద్రోహం చేసిందని కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలియజేసి, ప్రభుత్వ పార్టీ నాయకులు దిష్టిబొమ్మ దహనం చేశారు. దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం ఎందుకు నిర్వహిస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్, గోపాల్, శేఖర్, నాని, ఆరిఫ్ పాల్గొన్నారు.

భవిష్యత్తు కాంగ్రెస్‌దే..

వంగూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పండిత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ వంశీకృష్ణ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

వెల్దండ: వానాకాలం రైతుబంధు పథకానికి నూతనంగా పట్టాపాసుపుస్తకం పొందిన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి మంజుల పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 18248 మంది రైతులకు ప్రభుత్వం రూ.23.28 కోట్లు రైతుబంధు డబ్బులు మంజూరు చేసిందన్నారు. రైతుబంధుకు ఈ నెల 16వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులందరూ అర్హులన్నారు. గతంలో రైతుబంధు కోసం బ్యాంక్ ఖాతా నంబర్లు ఇవ్వని రైతులు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



కల్వకుర్తి రూరల్: రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బలహీన వర్గాల అభ్యర్థులకు ఎక్కువ సంఖ్యలో సీట్లు కేటాయించేలా చూడాలని బీసీ యువజన సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కోరారు. రమేశ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన కడారి పార్వతమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం సింగల్‌విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్ వ్యక్తిగతంగా బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. రాజుయాదవ్, రామచంద్రయ్య, వెంకటేష్, రామ్‌కోటి, నిజాం, శ్రీను పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

కోడేరు: మండలంలోని రైతులు ఈకేవైసీ చేయించుకోని వారు ఈ నెల 30లోగా పీఎం కిసాన్ డబ్బులు పడేందుకు కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీరాం తెలిపారు. మిగిలిన రైతులు ఎవరైనా ఉంటే కేవైసీ చేయించుకోవాలని, లేకుంటే ఈ విడత పీఎం కిసాన్ డబ్బులకు అనర్హులు అవుతారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్‌సి నాయక్, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్, ఉపాధ్యక్షుడిగా సీతారాం, కోశాధికారిగా శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా భీష్మనాయక్, సలహాదారులుగా దశరథం, కృష్ణ, నాగరాజును ఎన్నుకున్నారు.

అక్రమ ఫీజుల వసూళ్లను ఆపాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను ఆపాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు కల్లబొల్లి మాటలు చెబుతూ ఫీజులు దండుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి

తెలకపల్లి: మండల పరిధిలోని తాళ్లపల్లి, కార్వంగ గ్రామాల మధ్యన చిన్నవాగుపై నిర్మించిన బ్రిడ్జి నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు శివశంకర్ కోరారు. గురువారం బ్రిడ్జిను పరిశీలించారు. బీఎస్పీ మండల నాయకులు శివశంకర్, రాజేష్, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రగతిపై ఇంటింటికీ బీజేపీ



ఉప్పునుంతలలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆ పార్టీ నాయకులు



లింగాలలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నాగర్‌కర్నూల్ క్రైం/ రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించే బీజేపీ బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఉప్పునుంతల: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. గురువారం ఉప్పునుంతలలో ఆ పార్టీ నాయకులు మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కట్టా సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌బీమా, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

లింగాల: బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మండల కేంద్రంలోని వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు కరపత్రాలను పంచుతూ ప్రజలు, వ్యాపారులతో మాట్లాడారు. యాదయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దకార్పాములలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నాయకులు గురువారం చేపట్టారు. భీమేశ్, రాజు, శ్రీనివాసులు, శివ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలేని సుధాకర్‌రావు కార్యకర్తలతో గురువారం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వంగూరు: మండల పరిధిలోని డిండిచింతపల్లిలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు ఆంజనేయులు, బాలస్వామి డిమాండ్ చేశారు. గురువారం డిండిచింతపల్లిని వారు సందర్శించి గతంలో ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో తక్షణమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: ఇంటి నుంచి బజారుకు వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవటంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో నివాసముండే అశోక్ మే 25న పని కోసం హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మరుసటి రోజున కూడా ఇంటికి తిరిగి రాకపోవటంతో బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అశోక్ భార్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

ఎంపీపీకి సన్మానం

తాడూరు: మండల పరిషత్ కార్యాలయం ఎంపీపీగా మూడు నెలల పాటు బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ శివలీలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గురువారం సన్మానించారు.

వ్యక్తికి జైలుశిక్ష

ఊర్కొండ: డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలు శిక్ష పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీఎస్ సంతోష్ మద్యం తాగి లారీని నడుపుతున్నాడు. కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనాలను పరిశీలించగా.. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించిన సందర్భంలో పట్టుపడినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపినట్లు నిర్ధరణ కావడంతో కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. మెజిస్ట్రేట్ చార్లెస్ రాజు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు చెప్పారు.

లక్ష్మణ్‌రావుకు గౌరవ డాక్టరేట్

కొల్లాపూర్: మండలంలోని ఎన్మన్‌బెట్లకి చెందిన వై.లక్ష్మణరావు డబ్ల్యూయూహెచ్‌యూ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం లక్ష్మణ్‌రావు చేస్తున్న కృషికి గాను డాక్టరేట్‌ను అందించారు. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఏబీఎం కే.వరప్రసాద్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రఘు చక్రవర్తి చేతుల మీదుగా లక్ష్మణ్‌రావు గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చైల్డ్ రైట్స్, క్రై సంస్థల సహకారంతో గ్రామిక వికాస కేంద్రం ద్వారా బాలకార్మిక నిర్మూలన, రైతు, కార్మిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

ప్రతిఒక్కరికీ రూ.లక్ష సాయం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న బీసీలకు రూ.లక్ష రుణాలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ ఇవ్వాలని రజక కులవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కొత్ర నవీన్ కుమార్ గురువారం డిమాండ్ చేశారు. ఈ మేరకు నవీన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరి దరఖాస్తులను ప్రభుత్వం మున్సిపల్ అధికారులు వెరిఫికేషన్ చేశాకే లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని డిమాండ్ చేశారు.

పేద కుటుంబాలకు భరోసా పోస్టల్ బీమా

మన్ననూర్: పోస్టల్ బీమా(ఇన్సూరెన్స్) పథకం పేద కుటుంబాలకు భరోసాగా ఉంటుందని సర్పంచ్ నేనావత్ శ్రీరాం అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పోస్టల్ ఎంఓ ఎండీ ఖాన్‌తో కలిసి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీని(పోస్టల్ బీమా) గ్రామపంచాయితీ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏడాది గానూ రూ.396 చెల్లిస్తే.. రూ.10 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని తెలియజేశారు. చెన్నకేశవులు, భీముడు, పర్వతాలు, గోపాల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



పాలసీని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరాంనాయక్

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



వినతి అందజేస్తున్న కార్మికులు

తాడూరు: పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలంటూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయడంతో పాటు కార్మికులు ఎంపీడీఓ గంగమోహన్‌కు సమ్మె నోటీసు అందించారు. ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలన్నారు. తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధ సభ్యులు నాగమల్లి, శివ, కైరత్ పాష, జంగయ్య, బాలయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఆస్పత్రి ఆకస్మికంగా తనిఖీ

కల్వకుర్తి టౌన్: వైద్యులు వారి విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా డీసీహెచ్ఎస్ రమేష్‌చంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో తిరుగుతూ రోగులకు అందిస్తున్న సేవలపై వారి నుంచి పలు వివరాలు సేకరించారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి వైద్యుడు ఖచ్చితంగా వారి ఓపీ టైమింగ్ పాటించాలన్నారు. సాధారణ ప్రసవాలను పెంచటంతో పాటుగా, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి ఆరోగ్యాన్ని విధుల్లోని కిందిస్థాయి సిబ్బంది పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు స్వర్ణలత, యశోదాభాయి, కృష్ణ, పాండురంగ, స్వప్న, ప్రభావతి పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న రమేష్‌చంద్ర

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

పెద్దకొత్తపల్లి: పాఠశాలల్లో విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్ఐ రాజు యాదవ్ సూచించారు. అక్షరా డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మద్దిలేటి, లవకుమార్, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

